ప్రజాశక్తి
ఆదివారం 5 జనవరి 2025
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

అబ్బురం..!

- నేవీ విన్యాసాలు అదుర్స్
- విశాఖ తీరం.. జన సంద్రం
- నావికుల సాహసాలకు చంద్రబాబు కితాబు

విన్యాసాలను తిలకిస్తున్న జనం

దూసుకెళ్తున్న యుద్ధ ట్యాంకర్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ

అబ్బురం.. ఆశ్చర్యం..!. ఒక్కమాటలో చెప్పాలంటే విశాఖ ఆర్‌కె బీచ్‌లో శనివారం సాయంత్రం భారత నావికాదళం ప్రదర్శించిన విన్యాసాలు ప్రతి ఒక్కరినీ కట్టిపడేశాయంటే అతిశయోక్తికాదు. ఏటా నేవీ డే డిసెంబర్ 4 సందర్భంగా జరిగే నౌకాదళ విన్యాసాలు 2024లో ఒడిశాలో జరగ్గా వాటికి కొనసాగింపుగా 'ఆపరేషనల్ డెమో - 2025' పేరిట శనివారం చేపట్టిన విన్యాసాలు అదరహో అనిపించాయి. తూర్పు నౌకాదళ శక్తి సామర్థ్యాలకు నిలువుటద్దంగా ఈ విన్యాసాలు నిలిచాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విన్యాసాలలో 14 యుద్ధ నౌకలు, 20 విమానాలు, ఒక జలాంతర్గామి పాల్గొన్నాయి. జలాంతర్గామి ఐఎన్‌ఎస్ వెలా, సీకింగ్ హెలికాప్టర్ చార్లీ, జెమిని బోట్లు, మార్కొస్ డెమో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఐఎన్‌ఎస్ జలస్వ, ఐఎన్‌ఎస్ ఐరావత్‌లు విన్యాసాలను ప్రదర్శించాయి వీటితోపాటు ఐఎన్‌ఎస్ ముంబయి, ఐఎన్‌ఎస్ కిల్తాన్, ఐఎన్‌ఎస్ కవరతి మిగతా 2లో..

విన్యాసాలను తిలకిస్తున్న చంద్రబాబు కుటుంబం

చెట్లు నరికిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న లోకనాథం, కోటేశ్వరరావు తదితరులు

బల్క్ డ్రగ్ పార్క్ వద్దు

- 8న నల్ల రిబ్బన్లతో నిరసన
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

వార్త మెయిన్‌లో...

విశాఖ అభివృద్ధికి చర్యలు చేపట్టండి

▶ వార్త 2లో..

విద్యుత్ భవన్‌ను అదానీకి కట్టబెట్టడం ఆపాలి : సిపిఎం

▶ వార్త 2లో..

భోజనం వడ్డిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రభుత్వ కాలేజీల్లో

మెరుగైన విద్యా బోధన

- స్పీకర్ అయ్యన్న, మంత్రులు అనిత, డోలా
- డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

వార్త 7లో..

6వ వర్ధంతి

జననం : 01-06-1941

మరణం: 05-01-2019

ఆచార్య శిరోమణి శ్రీమతి డాక్టర్ సత్యబాల రత్నరాజు
MA (USA), M.Sc, PHD
కేథరిన్ మరియు స్ప్రింగ్‌ఫీల్డ్ విద్యాసంస్థల సహ వ్యవస్థాపకురాలు
మీరు మా నుండి దూరమై నేటికి 6 వసంతాలు గడిచిననూ
మీ జ్ఞాపకాలు ప్రతిరోజు స్మరించుకుంటూ... మీకు మా నివాళి అర్పిస్తున్నాం.

SPRINGFIELD SCHOOL
Camp David, Krishna Puram, Padmanabham, Visakhapatnam.
Cell : 913349307

పాదయాత్రలో పాల్గొన్న సిహెచ్.నర్సింగరావు, తదితరులు

ఉక్కు రక్షణకు పాదయాత్ర

సొంత గనులు కేటాయించాలి : సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - గాజువాక : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి, సొంత గనులు కేటాయించాలి, ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి అన్న నినాదంతో సిఐటియు ఆధ్వర్యంలో అక్కిరెడ్డిపాలెంలో శనివారం సాయంత్రం నల్ల జెండాలు చేబూని కార్మికులు, ప్రజలు, స్థానిక మహిళలు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ మోడీ విశాఖ పర్యటన సందర్భంలోనే స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తామని ప్రకటించాలన్నారు. ఉక్కు కర్మాగారాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ లేకపోతే గాజువాక ఎడారిగా ఉండేదన్నారు. ప్లాంట్ నిర్మాణం తర్వాతనే విశాఖ నగర రూపురేఖలు మారాయని గుర్తుచేశారు. కార్మికులు, ప్రజల పోరాటంతో నాలుగు సంవత్సరాలైనా ఉక్కు కర్మాగారంలో ఒక శాతాన్ని కూడా ప్రైవేటుపరం చేయడం మోడీ తరం కాలేదన్నారు. మూడు నెలల నుండి ఉక్కు కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. వేజ్ రివిజన్ అమలు చేయకపోవడం తగదన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్టీల్‌ప్లాంట్‌కు రూ.15 వేల కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఆర్థిక వనరులు, సొంత గనులు ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు. ఉక్కు కర్మాగార చారిత్రక నేపథ్యాన్ని వివరించారు. అక్కిరెడ్డిపాలెం వీధుల్లో పాదయాత్ర సాగింది. కార్యక్రమంలో ఎం.రాంబాబు, ఎ.లోకేశ్వరరావు, ఎం.రాజేంద్రప్రసాద్, బంగారు నాయుడు, దాసర అప్పారావు, విశాఖ డెయిరీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు రమణ, మూర్తి పాల్గొన్నారు.

సెవెన్‌హిల్స్ కార్మికులకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎంజిఎం సెవెన్ హిల్స్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న కార్మికులలో కొంతమందికి కక్షపూరితంగా జీతాలు చెల్లించకపోవడాన్ని ఖండిస్తూ విశాఖ జిల్లా హాస్పిటల్, నర్సింగ్ హోమ్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శనివారం జగదాంబ జంక్షన్ నుంచి నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.రాజు మాట్లాడుతూ ఎంజిఎం సెవెన్ హిల్స్ హాస్పిటల్ మేనేజ్మెంట్ ఇప్పటికే 38 మందిని విధుల్లోంచి తొలగిస్తామని ముందస్తు నోటీసులు ఇచ్చిన క్రమంలో కార్మికులు పోరాడి తమ ఉద్యోగాలను న్యాయబద్ధంగా కాపాడుకున్నారని తెలిపారు. దీనిని సహించలేని హాస్పిటల్ యాజమాన్యం కార్మికులకు చెల్లించాల్సిన జీతాలను ఆపివేసి వారిపై కక్ష సాధింపునకు పూనుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దుర్మార్గపు చర్యలను ఖండిస్తూ జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్‌కి ఫిర్యాదు చేయడానికి ర్యాలీగా బయలుదేరామని చెప్పారు. జెసిఎల్ వెంటనే యాజమాన్యంతో మాట్లాడి కార్మికులకు జీతాలు ఇప్పించి సదరు యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. యాజమాన్యంతో మాట్లాడి జీతాలు చెల్లించేలా చూస్తామని లేబర్ ఆఫీసర్ తమకు హామీ ఇచ్చారన్నారు. సమస్య పరిష్కారంకాని పక్షంలో కార్మికులు తమ హక్కులను కాపాడుకునేందుకు ఎటువంటి పోరాటానికైనా వెనకాడరని రాజు హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నూకరాజు, శేఖర్, సుబ్బారావు, నర్సింగరావు పాల్గొన్నారు.

విశాఖ అభివృద్ధికి చర్యలు చేపట్టండి

- ఉక్కు ప్రైవేటీకరణను ఉపసంహరించుకోండి

- ప్రధానికి ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక లేఖ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రధాని మోడీ విశాఖ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ కోరారు. ఈ మేరకు పలు అంశాలతో కూడిన లేఖను ప్రధానికి ఆయన రాశారు. ఆ వివరాలను శనివారం మీడియాకు వెల్లడించారు. వరుసగా మూడోసారి భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఈ నెల 8న విశాఖకు మోడీ వస్తున్నారని తెలిపారు. 'సిటీ ఆఫ్ డెస్టినీ'గా పేరొందిన విశాఖ గత దశాబ్దంలో నిర్లక్ష్యానికి గురైన నగరంగా తయారైందని లేఖలో పేర్కొన్నారు. దీనిని సరిదిద్దే బాధ్యత ప్రధానిపై ఉందని గుర్తుచేశారు. తెలుగు ప్రజలకు గర్వకారణమైన విశాఖ ఉక్కు కర్మాగారం అత్యంత కష్టకాలంలో ఉందని పేర్కొన్నారు.

ఈ ప్రతిష్టాత్మకమైన ప్లాంటును విక్రయించాలని నిర్ణయించుకోవడమే కాకుండా అన్ని విధాలుగా తమరి నేతృత్వంలోని ప్రభుత్వం బలహీనపరుస్తోందన్నారు. ఈ ప్లాంట్ లేకుండా రాష్ట్రం, ఈ ప్రాంతం అభివృద్ధి కాజాలదన్నారు. అందువల్ల ఈ నగరంలో దిగిన తర్వాత ఉక్కు ప్రైవేటీకరణను విరమించుకుంటున్నట్టు ప్రకటించాలని కోరారు. వాల్తేరు డివిజన్‌తో కూడిన రైల్వే జోన్ అవసరమన్నారు. ఉత్తరాంధ్రకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ ఇవ్వాలన్నారు. ఎపి రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని నిజమైన స్ఫూర్తితో అమలు చేయాలన్నారు. విశాఖపట్నంలో మెట్రో రైలును పూర్తి చేయాలని ఆకాంక్షించారు. పెట్రోలియం, గిరిజన యూనివర్శిటీల నిర్మాణాన్ని సత్వరం పూర్తి చేయాలన్నారు.

అబ్బురం..!



అబ్బురపరిచిన డ్రోన్ షో



విద్యుత్ వెలుగుల్లో నౌకలు

(మొదటి పేజీ తరువాయి..) ద్వారా హెలికాప్టర్ ల్యాండింగ్ ఆపరేషన్ వంటివి ఆసక్తిగా సాగాయి. హెలీకాప్టర్లు ఆర్క్ నమూనాలో ఎగరడం, పి8ఐ విమానాల ద్వారా బాంబులు జారవిడువడం అబ్బురపరిచాయి. ఐఎన్ఎస్ సావిత్రి, ఐఎన్ఎస్ సంధ్యాక్ వరుస క్రమంలో వచ్చి అలరించాయి. లేజర్, డ్రోన్ షోలు ఆకట్టుకున్నాయి. డ్రోన్ షోలో భారత చిత్రపటం, నావికా దళాలకు చెందిన విమానాలు, శివాజీ చిత్రపటంతో పాటు నేవీ చిహ్నం ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాత్రి వేళ రంగురంగుల విద్యుత్ వెలుగులతో పెద్దపెద్ద నౌకలు మిరమిట్లుగొలిపాయి. నేవీ విన్యాసాలను చంద్రబాబు ఆయన సతీమణి భువనేశ్వరి, మనవడు దేవాన్ష్ తదితరులు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ తన మనసును మైమరపించేలా విన్యాసాలు జరిగాయని కితాబిచ్చారు. నావికుల సేవలను కొనియాడారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి నేవీ ముందుకు రావాలని కోరారు. నాలెడ్జ్ సిటీగా విశాఖపట్నం నిలువనుందన్నారు.

ఆకట్టుకున్న నావికుల యుద్ధ ప్రదర్శన

చంద్రబాబుకు జ్ఞాపిక అందజేస్తున్న నేవీ అధికారులు

నేవీ డే వేడుకలు సంబంధాల మెరుగుకు దోహదం

వేడుకల్లో భాగంగా తూర్పు నావికాదళ విభాగాధిపతి కమాండింగ్ ఆఫీసర్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెందర్కర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి పూర్తిగా సహకరించిందని తెలిపారు. ఈ సహకారం ఇండియన్ నేవీ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని మెరుగుపరుస్తుందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇండియన్ నేవీకి సహకరిస్తోందని, అందువల్లే ఎన్నో అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాలను విశాఖ వేదికగా నిర్వహించగలుగుతున్నామని తెలిపారు. నేవీ గొప్పతనాన్ని వివరించారు.

విన్యాసాల్లో పాల్గొన్న నేవీ హెలికాప్టర్లు

నృత్యాలతో అలరించిన కళాకారులు

విద్యుత్ భవన్‌ను అదానీకి కట్టబెట్టడం ఆపాలి

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ నగరం నడిబొడ్డునగల ఎపిఇపిడిసిఎల్ సూపరింటెండెంట్ సర్కిల్ ఆఫీస్ భవన సముదాయమైన విద్యుత్ శాఖ భవన్‌ను అదానీకి కట్టబెట్టే చర్యలను రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం తక్షణమే నిలిపివేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలోని గ్రీన్ పార్కు హోటల్‌కు ఎదురుగా విద్యుత్ శాఖ భవన్ సుమారు 2.20 ఎకరాల స్థలంలో నిర్మితమై ఉందని, విద్యుత్ శాఖ కార్యకలాపాలు దీనిలో సాగుతున్నాయని తెలిపారు. దీని విలువ సుమారు రూ.100 కోట్లకుపైగా ఉంటుందని, దీన్ని అదానీకి కట్టబెట్టడానికి టిడిపి కూటమి సిద్ధపడిందని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వం గంగవరం పోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న 10.4 శాతం వాటాలతో సహా పోర్టును అదానీకి కట్టబెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. ఆనాడు సిపిఎం, వామపక్షాలతో పాటు, దానిని తెలుగుదేశం, జనసేన పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. అదానీతో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందాలను రద్దు చేయాలని చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్‌లు డిమాండ్ చేశారని గుర్తు చేశారు. నేడు అధికారం చేపట్టిన తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి వైసిపి బాటలోనే నడవడం ప్రజలను మోసగించడమేనని విమర్శించారు. అదానీ వ్యాపారాలకు విశాఖను అడ్డాగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉన్నట్లుందన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో సోలార్ విద్యుత్తు ఒప్పందంలో రూ.1729 కోట్లను రాష్ట్ర అధినేతకు అదానీ ముడుపులు చెల్లించినట్లు బయటపడినా ఇంతవరకు టిడిపి కూటమి ప్రభుత్వం అదానీపైగానీ, మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డిపైగానీ ఎటువంటి చర్యలూ తీసుకోలేదని తెలిపారు. అదానీకి టిడిపి కూటమికి ఉన్న బంధం అంత పటిష్టంగా ఉందని ఎద్దేవా చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని మొత్తం అదానీ చేతిలో పెట్టేందుకు సిద్ధపడిందని, దీనిని గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో అమలుకు పూనుకుందని అన్నారు. దీని వల్ల ప్రజల మీద పెద్ద ఎత్తున భారాలు పడుతున్నాయని తెలిపారు. టిడిపి, జనసేన పార్టీలు ప్రతిపక్షంలో ఉండగా దీనిని వ్యతిరేకించాయని, అధికారం చేపట్టాక ఆ విధానాలనే అమలు చేస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్లకు కట్టబెట్టడంలో, ప్రజలపై భారాలు వేయడంలో గత వైసిపికి, నేటి కూటమికి తేడా ఏమీ కనిపించడం లేదన్నారు. వైసిపికి ప్రత్యామ్నాయ పాలనను ప్రజలు కోరుకుని కూటమికి అఖండ విజయం అందించారన్నారు. ప్రజల అభీష్టానికి అనుగుణంగా టిడిపి కూటమి పాలన సాగించాలని, ప్రజల ఆస్తులను కాపాడాలని అన్నారు. కార్పొరేట్లకు కట్టబెట్టడం నిలిపివేయాలన్నారు. ధరల భారాలు, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరారు. విద్యుత్ శాఖ భవన్‌ను అదానీకి కట్టబెట్టే చర్యలను ఆపకపోతే చంద్రబాబు, పవన్‌లు ప్రజాగ్రహం చవిచూడక తప్పదని హెచ్చరించారు. ప్రజలు, విద్యుత్ శాఖ ఉద్యోగులు, కార్మికులు ప్రభుత్వ చర్యలను నిరసించాలని విజ్ఞప్తి చేశారు.

ముఖ్యమంత్రిని కలిసిన కోరాడ

ప్రజాశక్తి -ఆనందపురం : నేవీ డే కార్యక్రమంలో పాల్గొనడానికి విశాఖ వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును భీమిలి నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు కలిశారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

రైతు కేంద్రం సహాయకులతో సమీక్ష

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న రైతు కేంద్ర సహాయకులతో మండల వ్యవసాయ కార్యాలయంలోవ్యవసాయాధికారి ఎంవి.చలం శనివారం సమీక్ష నిర్వహించారు. రబీ సీజన్‌లో వేసిన వివిధ రకాల పంటల నమోదును, ఈకేవైసీని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. డిసెంబర్ నెలలో కురిసిన వర్షాలకు చేడి పంట వేసి నష్టపోయిన రైతులకు 8 శాతం రాయితీపై విత్తనాలు పంపిణీ చేస్తామని తెలిపారు.

7వ వార్డులో సమస్యల పరిశీలన

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధి స్వతంత్రనగర్, అల్లూరి సీతారామరాజునగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి, పాఠశాల, పార్కులను 7వ వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, పిళ్లా వెంకటరావు, పౌర సంక్షేమ సంఘం అధ్యక్షులు నాగోతి సూర్యప్రకాష్ శనివారం సందర్శించారు. అక్కడ ఉన్న సమస్యలను తెలుసుకొని జివిఎంసి అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ మంగమ్మ తెలిపారు. రోగులకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా ఉండాలని ఆదేశించారు. పార్కులోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి కొందరు ఆకతాయిలు రంగులు పూసి అందవిహీనంగా తయారు చేసిన ఘటనను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో పౌరసంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు ఎల్ఎస్.నాయుడు, శ్రీపాద వెంకటరమణ, బెల్లపు పాపారావు, జగన్మోహన్‌చౌదరి, వంటకుల శ్రీనివాసరావు, మామిడి వరలక్ష్మి, తోట ఆషా స్వరూప్, బి.జోగారావు పాల్గొన్నారు.

భూముల రహదారి ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం బంటుపల్లి వారి కల్లాలు పంచాయతీలో వ్యవసాయ భూములకు వెళ్లే రహదారిని ఆక్రమించి దౌర్జన్యంతో దాడి చేసినట్లు స్థానిక తహశీల్దార్‌కు మీసాల నరసింగరావు, పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. గ్రామంలో తన వ్యవసాయ భూమిలోకి ట్రాక్టర్ తీసుకుని వెళ్తగా గ్రామానికి చెందిన మీసాల అచ్చుపుడు రోడ్డుకు ఆటంకం కలిగించారని, వ్యవసాయ పనులు చేసే తమ వారిని అడ్డుకొని దౌర్జన్యానికి పాల్పడ్డారని మీసాల నరసింగరావు వివరించారు. సర్వే నెంబరు 51/11 వ్యవసాయ పనులకు వెళ్లడానికి ఉన్న రహదారిని వ్యక్తిగత కక్షతో ఆక్రమణకు పాల్పడుతున్నారని, ఈ రహదారి ద్వారా సుమారు 50 మంది రైతులు వ్యవసాయ పనులకు వెళ్లాల్సి ఉందని తెలిపారు. దీనిపై రెవెన్యూ అధికారులు పరిశీలించి వ్యవసాయ భూములకు వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని నర్సింగరావుతో పాటు పలువురు రైతులు కోరారు.

హుదూద్ ఇళ్ల కేటాయింపులపై సర్వే

ప్రజాశక్తి - ఆరిలోవ : హుదూద్ ఇళ్ల కేటాయింపులో వైసిపి నాయకులు భారీగా అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో 13వ వార్డు పైనాపిల్ కాలనీలో నిర్మించిన ఇళ్ల వద్ద శనివారం యుసిడి అధికారులు, సిబ్బంది సర్వే నిర్వహించారు. హుదూద్ తుపాన్ ప్రభావంతో శివగణేష్‌నగర్, వాసవానిపాలెం, జాలారి ఎండాడ ప్రాంతంలో పూరిపాకలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వారికోసం పైనాపిల్ కాలనీలో 10 బ్లాకుల్లో 320 ఇళ్లు నిర్మించారు. వీటిలో మొదట విడతగా 240 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశారు. మిగతా ఇళ్ల విషయంలో వైసిపి నాయకులు అవకతవకలకు పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఈ విషయమై తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అసెంబ్లీలో ప్రస్తావించడంతో లబ్ధిదారుల జాబితాలను పునపరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేకంగా కమిటీని నియమించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రెండు రోజుల నుంచి ఈ సముదాయంలో రీ సర్వే నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 75 శాతం సర్వే పూర్తి చేసినట్లు తెలుస్తోంది. కొంతమంది ఇళ్లలో ఉండగా, మరికొంత మంది అద్దెలకు ఇచ్చినట్టు, మరికొంత మంది డోర్ లాక్ చేసి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పూర్తి స్థాయిలో సర్వే చేస్తే ఎంతమంది నిజమైన లబ్ధిదారులు, ఎంత మంది బినామీలు ఉన్నారు? ఎంతమంది అమ్ముకున్నారు? అనే విషయాలు బయటపడతాయని అధికారులు అంటున్నారు.

పైనాపిల్ కాలనీలోని హుదూద్ ఇళ్లలో సర్వే చేస్తున్న అధికారులు, సిబ్బంది

యుటిఎఫ్ జాతాకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - ఆనందపురం : కాకినాడలో ఆదివారం ప్రారంభం కానున్న స్వర్ణోత్సవ మహాసభకు శ్రీకాకుళం నుంచి బయలుదేరిన జాతాకు యుటిఎఫ్ ఆనందపురం మండల శాఖ ఆధ్వర్యాన ఆనందపురం కూడలిలో ఘన స్వాగతం పలికారు. మహాసభ విజయవంతం కావాలని నినదించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్, కార్యదర్శి ఉప్పాడ రాము, పూర్వ ప్రధాన కార్యదర్శి వైఆర్‌కె ప్రసాద్, మండల కోశాధికారి గిడుతూరి రాజా, నాయకులు వై.భాస్కర్, రామసత్యం, మహేష్, ప్రేమ్‌కుమార్, భాను, ప్రసాద్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి -తగరపువలస : కుమార్తె కాపురం కుదుట పడక పోవడంతో కలత చెంది బలవన్మరణానికి పాల్పడ్డ మండలంలోని టి.నగరపాలెం పంచాయతీ, గొల్లలపాలెం గ్రామానికి చెందిన బొట్టా శ్రీనివాసరావు కుటుంబాన్ని మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ శనివారం పరామర్శించారు. మృతుని చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అధైర్యపడొద్దని మృతుని భార్య, కుమార్తెకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల వైసిపి నాయకులు గాడు శ్రీను, దుంపల ప్రభాకర్, కెపి.సత్యనారాయణ, పొట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు, బంక సత్యం, ఎస్.గిరిబాబు, చెల్లూరి నగేష్ బాబు తదితరులు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

కోళ్ల ఫారం దగ్ధం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని తర్లువాడ గ్రామంలో బిఆర్‌బి నాయుడు కోళ్ల ఫారంలో శుక్రవారం రాత్రి 11 గంటలకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికులు తాళ్లవలస అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో షెడ్డు పూర్తిగా కాలిపోయింది. సుమారు మూడు లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

ఆత్మహత్యకు పాల్పడిన రైతు మృతి

ప్రజాశక్తి- కె.కోటపాడు : ఆర్థిక ఇబ్బందుల వలన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన మండలంలోని మేడిచర్లకు చెందిన రైతు ఆరు రోజుల పాటు మృత్యువుతో పోరాడి శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఎ.కోడూరు ఎస్సై డి.లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలు ప్రకారం... మేడిచర్ల గ్రామానికి చెందిన రొంగలి కోటేశ్వరరావు (44) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయానికి పెట్టిన పెట్టుబడి రాకపోవడంతో పాటు ఇతర ఆర్థిక సమస్యలు, అనారోగ్య సమస్యలు తలెత్తడంతో డిసెంబరు నెల 28వ తేదీన తన పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఇది గమనించి కోటేశ్వరరావు భార్య దేవి, కుమారుడు వెంటనే ఆయన్ను మండల కేంద్రంలోని 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖలో కేజీహెచ్‌కి తరలించారు. ఆ రోజు నుండి కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న కోటేశ్వరరావు ఈ నెల 3వ తేదీ రాత్రి పరిస్థితి విషమించి మృతి చెందారు. మృతునికి భార్య దేవితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

100 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం ఏజెన్సీ రొచ్చు పనుకు గ్రామం నుంచి తరలిస్తున్న 100 కేజీల గంజాయిని చాకచక్యంగా పట్టుకొని ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు కొత్తకోట సిఐ జి.కోటేశ్వరరావు శనివారం సాయంత్రం తెలిపారు. ఆయన కథనం మేరకు చీమలపాడు పంచాయతీ శివారు రొచ్చు పనుకు గ్రామం నుంచి గంజాయి తరలి వెళ్తున్నట్టు ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో మాటు వేశామన్నారు. ఆటోను ఆపి తనిఖీ చేయగా రూ. 5 లక్షల విలువైన 100 కేజీల గంజాయి మూటలు లభించాయన్నారు. గంజాయితో పాటు ఆ ఆటోలో ఉన్న ఏడుగురిని అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి మూడు మొబైల్ ఫోన్లు, రెండు వేలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసులు నమోదు చేసి కోర్టుకు తరలించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎం శ్రీనివాస్ సిబ్బంది ఉన్నారు.

సభ్యత్వాల పేరుతో టిడిపి మోసం : గుడివాడ

మీడియాతో మాట్లాడుతున్న అమర్‌నాథ్

ప్రజాశక్తి -ఆనందపురం : సభ్యత్వాల పేరుతో టిడిపి నాయకులు ప్రజలను మోసం చేస్తున్నారని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆరోపించారు. ఆనందపురం మండలం, వేములవలస జంక్షన్‌లోని జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు ఇంటివద్ద శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో అమర్‌నాథ్ మాట్లాడుతూ, ముచ్చెర్ల గ్రామంలో వందకు వంద శాతం టిడిపి సభ్యత్వ నమోదు అనేది పచ్చి అబద్ధం అన్నారు. గ్రామంలో 1400 మంది టిడిపి సభ్యత్వం తీసుకున్నట్లు వార్తలు రాయిస్తూ రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. ముచ్చెర్ల గ్రామంలో వైసిపి బలంగా ఉందన్నారు. సర్పంచ్, ఎంపిటిసి సభ్యులు వైసిపి వారేనని గుర్తుచేశారు. గత ఎన్నికల్లో 1350 ఓట్లుకు గాను టిడిపి, వైసిపి మధ్య 150 ఓట్లు తేడా మాత్రమే ఉందన్న విషయాన్ని గుర్తుచేశారు. అయినా అంతా టిడిపిదేనన్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. సంక్షేమ పథకాలు ఇస్తామని చెప్పి టిడిపి నేతలు ప్రజల ఆధార్‌కార్డులు తీసుకొని సభ్యత్వం నమోదు చేస్తున్నారన్నారు. 100 శాతం సభ్యత్వం జరిగిందని లోకేష్ ముచ్చెర్ల గ్రామానికి ఎలా వస్తారని ప్రశ్నించారు. ఆ గ్రామంలో వైసిపి, బిజెపి, జనసేన పార్టీలకు ఎవరూ లేరా అని ప్రశ్నించారు. సభ్యత్వంపై తప్పుడు లెక్కలు చెప్పడం మంచి పద్ధతి కాదన్నారు. కొన్ని చోట్ల బెదిరించి సభ్యత్వ నమోదు చేస్తున్నారని, పక్క రాష్ట్రాల వారికి సభ్యత్వం ఇస్తున్నారని ఆరోపించారు. ముచ్చెర్ల గ్రామంలో 600 ఎకరాల భూమిని టిడిపి నాయకులు కొట్టేసే ప్రయత్నంలో భాగంగా సభ్యత్వంపై దొంగ లెక్కలు చెబుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బంక సత్యం, జెడ్‌పిటిసిలు కోరాడ వెంకట్రావు, సుంకరి గిరిబాబు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, జి.శ్రీను, వైస్ ఎంపిపిలు పాండ్రంకి శ్రీను, రామకృష్ణ, కోరాడ అచ్యుత్‌రాంబాబు, కొట్యాడ గోపి పాల్గొన్నారు.

బలవంతమేమీ లేదు : టిడిపి

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ఆనందపురం : ముచ్చర్ల గ్రామంలో ప్రజలు స్వచ్ఛందంగా తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు చేసు కున్నారని, ఇందులో బలవంతం ఏమీ లేదని టిడిపి సీనియర్ నాయకులు తాత్రాజు అప్పారావు, బిఆర్‌బి. నాయుడు పేర్కొన్నారు. మండలంలోని గిడిజాలలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, టిడిపి సభ్యత్వాలను బలవంతంగా నమోదు చేసినట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడాన్ని వారు ఖండించారు. అమర్‌నాథ్ వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడడం సరికాదన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకుంటామని గ్రామ సర్పంచ్ శనగం ఎర్రయ్య, పలువురు వార్డు మెంబర్లు తమను కోరారని తెలిపారు. గ్రామంలో ఇనాం భూ సమస్యలను పరిష్కారానికి ఐక్యంగా టిడిపి సభ్యత్వాలు తీసుకుంటామని ఎమ్మెల్యే గంటాతో మాట్లాడారని వివరించారు. ఇప్పుడు సర్పంచ్ శినగం ఎర్రయ్య మాట మార్చారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ముచ్చర్ల మాజీ సర్పంచ్ అప్పలనారాయణ, నాయకులు ఆబోతు అప్పలరాము, చిన్నా, శ్రీకాంత్, అప్పలరాజు, పాండ్రంకి అప్పలరాజు, జనసేన ప్రధాన కార్యదర్శి కోరుకొండ మూర్తి, షినగం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చండీగఢ్‌లో విద్యుత్ ప్రయివేటీకరణపై నిరసన

ప్రజాశక్తి -గాజువాక : చండీగఢ్ రాష్ట్రంలో విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యాన భెల్ మెయిన్ గేటు వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు భెల్ యూనిట్ ప్రధాన కార్యదర్శి జెటిపి ప్రకాష్ మాట్లాడుతూ, చండీగఢ్ రాష్ట్రంలో విద్యుత్తు ప్రైవేటీకరణ ప్రభావం భెల్‌పై పడుతుందన్నారు. గతంలో భెల్‌లోని అన్ని యూనిట్లలో 60 వేల మంది ఉద్యోగులు ఉండేవారని, నేడు 28 వేలు మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. ఉద్యోగ నియామకాలు జరగలేదన్నారు. భెల్ విశాఖ యూనిట్‌లో గతంలో 4000 మంది ఉండేవారని, ప్రస్తుతం 680 మంది మాత్రమే పనిచేస్తున్నారని చెప్పారు. ఉద్యోగులపై పని ఒత్తిడి పెరుగుతోందన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల స్థానంలో కాంట్రాక్టు కార్మికులను నియమిస్తున్నా వారికి సరైన వేతనాలు కల్పించడం లేదన్నారు. యాజమాన్యం వెంటనే స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.జగన్నాధరావు, కె.నారపరెడ్డి, ఎన్‌వి.శ్రీనివాసరావు, కె.విజయకుమార్, ఎ.అప్పలనారాయణ, బి.కృష్ణమూర్తి, జి.అచ్చన్నాయుడు, ఎస్.అప్పారావు, పి.శివరాం, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెటిపి ప్రకాష్

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి హాని

ప్రజాశక్తి -గాజువాక : ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి విఘాతం కలుగుతుందని గాజువాక జోనల్ కమిషనర్ బిఆర్ఎస్ శేషాద్రి అన్నారు. జెడి ఫౌండేషన్, జివిఎంసి ఆధ్వర్యాన గాజువాక మహిళా రైతుబజార్ వద్ద ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్ధాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ శేషాద్రి మాట్లాడుతూ, మైక్రో ప్లాస్టిక్ వల్ల మానవజాతి మనగడకు ముప్పువాటిల్లుతుందన్నారు. భూమిపైన, నీటిలో ఉండే జీవరాసులు ఆ ప్లాస్టిక్‌ను తినడం వల్ల మానవులపై కలిగే దుష్ప్రభావాలను వివరించారు. మైక్రో ప్లాస్టిక్ వల్ల మానవులు కేన్సర్ మొదలైన రోగాల బారిన పడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు, జివిఎంసి సిబ్బంది, జెడి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

'ఎయు వీసీ పోస్టును దళితులకు కేటాయించాలి'

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పోస్టును దళిత సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్‌కు కేటాయించాలని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జెవి.ప్రభాకర్ కోరారు. ఈ మేరకు నగరంలోని రామా టాకీస్ రోడ్డులోని అంబేద్కర్ భవన్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్ర యూనివర్సిటీ వీసీ పోస్టును దళితులకు ఇచ్చి సుమారు 20 సంవత్సరాలు అయిందన్నారు. సమర్ధులైన దళిత ప్రొఫెసర్లు ఎంతో మంది ఎయులో ఉన్నా గత ప్రభుత్వం విస్మరించిందని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో 10 లక్షల మంది దళితుల ఆకాంక్షలకు అనుగుణంగా ఆంధ్ర యూనివర్సిటీ వీసీ పోస్టును అర్హులైన దళిత ప్రొఫెసర్లకు ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం ఇంచార్జ్ వీసీల పాలన సాగుతుందని, భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి సుమారు 4 నెలలైనా ఇంతవరకు భర్తీ చేయలేదని తెలిపారు. హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ పోస్టు కూడా భర్తీ కాలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని 17 యూనివర్సిటీలలో పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీలైనంత తొందరగా ఈ పోస్టులు భర్తీ చేసి విద్యార్థుల భవిష్యత్తును చక్కదిద్దాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ నాయకులు గుబ్బల రాంబాబు, ఎబిడిఆర్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాటూరి శ్రీనివాసరావు, పతివాడ రాంబాబు, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-యంత్రాంగం

సబ్బవరం : రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు శాశ్వత పరిష్కారం అవుతాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు బి.చిన్నకృష్ణ అన్నారు. మండలంలోని గొట్టివాడ, గాలిభీమవరం గ్రామాలలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై గొట్టివాడలో 10 అర్జీలు, గాలి భీమవరంలో 9 అర్జీలు అందినట్లు తహశీల్దారు చిన్నకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సాలాపు మీనా వెంకటేశ్వరరావు, ఎంపిటిసి బోండా శేషుకుమారి సత్యారావు, గాలి భీమవరం సర్పంచ్ గొర్లి రాజేష్, భూ రీ సర్వే డిటి ఎం.గణపతిరావు, సర్వేయర్ ఎల్.అప్పారావు, వెలుగు సర్వేయర్ రాంబాబు, వీఆర్వో వాత్సల్య, విలేజ్ సర్వేయర్ ప్రసాద్ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని ఆర్.భీమవరంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ ఎం.లక్ష్మీ రైతుల నుండి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బల్లిన అమ్ము నాయుడు, ఎంపిటీసీ కంచిపాటి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ మళ్లీ రెడ్డి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరం : జివిఎంసి 87వ వార్డు పరిధి వడ్లపూడిలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ బోండా జగన్నాధం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా భూ ఆక్రమణలు, వివాదాలు, ఫిర్యాదులు పెద్ద సంఖ్యలో వస్తుండటంతో ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తెలిపారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి సమస్యలను తక్షణమే పరిష్కరిస్తారని తెలిపారు. బోండా జగన్నాధం మాట్లాడుతూ వార్డులో 22 ఎ సమస్య ఉందని, దానినుంచి విముక్తి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోన తాతారావు, రాజన్ రాజు, విజయరామరాజు, సిరిపల్లి కనకరాజు పాల్గొన్నారు.

దళితులకు సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి -తగరపువలస : దళితులకు సంక్షేమ పథకాలు అమలుచేయాలని మాల మహానాడు వ్యవస్థాపక కార్యదర్శి భాగం గోపాలరావు కూటమి ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా కొనసాగుతూ వస్తున్న 27 సంక్షేమ పథకాలను గత వైసిపి ప్రభుత్వం రద్దుచేసి దళితులకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఆయా పథకాలను పునరుద్ధరించాలని కోరారు. డిఎస్‌సి నోటిఫికేషన్ ద్వారా 16,500 ఉద్యోగాలను భర్తీ చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి వర్గీకరణను వ్యతిరేకిస్తూ దళిత వాడల్లో కరపత్రాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సమావేశంలో బోని సన్నిబాబు, మామిడి వెంకటశివ, కె.ఈశ్వరకుమార్, ఎస్.రాంబాబు, భీమిలి పట్టణ అధ్యక్షులు యు.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న శ్రీధర్

ఎస్ఎంసి విధులు, బాధ్యతలపై శిక్షణ

ప్రజాశక్తి- తగరపువలస : పాఠశాల యాజమాన్య కమిటీల విధులు, బాధ్యతలపై భీమిలి మండలం, తాటితూరు జెడ్‌పి హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు డి.శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. హిందీ పండిట్ టిఎస్‌వి.ప్రసాదరావు రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు యాజమాన్య కమిటీల బాధ్యతలు, విధులను వివరణాత్మకంగా తెలియజేశారు. ప్రభుత్వం అందజేయనున్న ప్రోత్సాహకాలను వివరించారు. ఎస్ఎంసి చైర్మన్ బి.సోమేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు సత్యబాల వర్ధంతి

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం పంచాయతీ పరిధిలో ఉన్న స్ప్రింగ్ ఫీల్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రాంగణంలో ఆదివారం సత్య బాల 6వ వర్ధంతిని నిర్వహించేందుకు ఆమె భర్త ఆచార్య ఆర్‌డి.రత్నరాజు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సత్యబాల 1941 జూన్ 1న గుంటూరులో జన్మించారు. అక్కడే ప్రాథమిక, ఉన్నత విద్యను పూర్తిచేశారు. 1966లో ఆచార్య ఆర్‌డి.రత్నరాజుతో వివాహమైంది. 1968లో భర్తతోపాటు అమెరికా వెళ్లి ఈస్టన్ మిషన్ యూనివర్శిటీలో ఎంఎ ఎడ్యుకేషన్ పూర్తి చేశారు. అక్కడి నుంచి తిరిగి 1972లో ఇండియా వచ్చారు. ఆంధ్ర యూనివర్సిటీ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో అధ్యాపకురాలిగా 25 సంవత్సరాలు సేవలందించారు. హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్, హయ్యర్ ఎడ్యుకేషన్ హెడ్‌గా పనిచేశారు. 1982లో భర్త ఆచార్య రత్నరాజుతో కలిసి భీమిలిలో కేథరిన్ ఎడ్యుకేషన్ సంస్థలను ప్రారంభించారు. 2001లో ఆంధ్ర యూనివర్సిటీ నుంచి రిటైర్డ్ అయ్యారు. పద్మనాభం మండలం కృష్ణాపురం పంచాయతీలో స్ప్రింగ్ ఫీల్డ్ పాఠశాలలు ఏర్పాటుకు ఎంతో ప్రోత్సాహం అందించారు. తన వద్ద చదువు సాగించిన విద్యార్థులు ఆమెను విద్యాదేవతగా కొనియాడుతున్నారు.

సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 52వ వార్డు పరిధి మర్రిపాలెం ఉడా లే-అవుట్ హెల్పీ వాకర్స్ గ్రీన్ బెల్ట్‌లో బుచ్చిరాజుపాలెం పినాకిల్ మానసిక వికలాంగుల చిన్నారులకు పాఠశాల యాజమాన్యం సంక్రాంతి సంబరాలు నిర్వహించింది. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ చిన్నారులతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానసిక వికలాంగులైన చిన్నారులకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించటం మంచిదన్నారు. వారిలో మానసిక ఉల్లాసం పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, పార్క్ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో శనివారం ఉత్సాహంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని జివిఎంసి ఒకటో వార్డు జనసేన అధ్యక్షులు పరిమి భువనేశ్వరి ఆధ్వర్యాన నిర్వహించిన పోటీల్లో మహిళలు ఉత్సాహంగా ముగ్గులు వేశారు. ముఖ్య అతిథులుగా నియోజకవర్గ టిడిపి, జనసేన ముఖ్య నేతలు కోరాడ రాజబాబు, పంచకర్ల సందీప్‌తోపాటు జనసేన 8వ వార్డు అధ్యక్షులు శాఖరి శ్రీనివాస్, యువ నాయకులు పరిమి ప్రీతం, టిడిపి జిల్లా కార్యదర్శి పిట్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు. వీరంతా ముగ్గులను తిలకించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ముగ్గులను తిలకిస్తున్న భువనేశ్వరి తదితరులు

ఉల్లాసంగా..ఉత్సాహంగా..

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక ఓ క్రిష్ట్ ఇంటర్నేషనల్ స్కూల్ 16వ వార్షిక క్రీడా దినోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన క్రీడా పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా, ఉల్లాసంగా సాగాయి. ప్రీ ప్రైమరీ నుంచి 3వ తరగతి విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. క్రీడా పోటీలను స్కూల్ ప్రిన్సిపల్ శైల భమిడిపాటి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధిలో క్రీడలు ఎంత ముఖ్యమన్నదీ వివరించారు. క్రీడల ద్వారా సమస్యలను ఎదుర్కొనే శక్తి, పరాజయాల నుంచి విజయాల వైపుగా వెళ్లే సామర్ధ్యం సమకూరుతాయని తెలిపారు. వంద మీటర్ల పరుగు, డ్రిల్, టీమ్ చాలెంజ్, అడ్డంకుల పందెం తదితర పోటీలు జరిగాయి. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న చిన్నారులు

అంగన్‌వాడీలో బాలల సంరక్షణ విద్య

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని బొడ్డపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో బాలల సంరక్షణ విద్య కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆట, పాటలు నిర్వహించారు. ప్రతినెలా ఐదో తేదీన నిర్వహించే ఈ కార్యక్రమానికి ఆదివారం సెలవు కావడంతో శనివారం నిర్వహించినట్లు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వెంకటరత్నం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఓ ఎం.శ్రీదేవి, సూపర్‌వైజర్ రత్నం, అంగన్‌వాడీ కార్యకర్త రమణమ్మ, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందని

మోడీ చేత స్పష్టమైన ప్రకటన చేయించాలి

చంద్రబాబును డిమాండ్ చేసిన సిపిఎం రాష్ట్ర నేత లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందని ప్రధాని నరేంద్ర మోడీతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టమైన ప్రకటన చేయించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె లోకనాథం శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నరేంద్ర మోడీ, చంద్రబాబుల ప్రత్యేక శ్రద్ధ కారణంగా అనకాపల్లి జిల్లాలో రూ.2లక్షల కోట్లతో పరిశ్రమలు రానున్నాయని శుక్రవారం అనకాపల్లి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో అనకాపల్లి ఎంపీ సిఎం.రమేష్ వెల్లడించారని తెలిపారు. ఎన్నికల ముందు తనను గెలిపిస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీకి కట్టుబడకుండా నక్కపల్లిలో ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు అన్ని ఏర్పాట్లు చేయడమంటే విశాఖ, ఉత్తరాంధ్ర ప్రజలను మోసం చేయడమేనని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలు దాటినా నేటికీ విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ముడి ఇనుప గనులు కేటాయింపు, సెయిల్‌లో విలీనం, 18వేల కోట్ల ప్యాకేజీ సమస్యను పరిష్కారం కాలేదని తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించకుండా ఆర్సిలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించాలని కేంద్రాన్ని కోరడం, భూమి కేటాయింపు, జిఎస్‌టి మినహాయింపు, విద్యుత్ రాయితీ, పెట్టుబడిసాయం, భూ బదలాయింపు ఫీజులు మినహాయింపు, మంచినీరు, రోడ్లు, రైల్వే లైన్స్ వంటి సదుపాయాలన్నీ కల్పించడానికి సిద్ధమవ్వడం సిగ్గుచేటన్నారు. 32 మంది ప్రాణత్యాగాలతో ఏర్పాడిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి వసతులు, విద్యుత్ రాయితీలు కల్పించకుండా ఆంధ్ర ప్రజలను మోసం చేయడం దారుణమన్నారు. ఇప్పటికే పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉపాధి కల్పిస్తున్న ప్రభుత్వరంగ సంస్థ అయిన విశాఖ స్టీల్‌ప్లాంను రక్షించకుండా ప్రైవేట్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు రాయితీలు ఇవ్వడానికి సిద్ధపడడం సహేతుకం కాదన్నారు. వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో సేకరించిన భూములకు పరిహారం, ప్యాకేజీ పూర్తిస్థాయిలో ఇవ్వకుండా, భారీగా పోలీసులను మోహరించి బల్క్ డ్రగ్ కోసం భూముల్లో ఉన్న చెట్లను తొలగించడం అన్యాయం కాదా అని ప్రశ్నించారు. పరిశ్రమలు, అభివృద్ధి పేరుతో విదేశాల్లో నిషేదించిన, కాకినాడ జిల్లా ప్రజలు తిరస్కరించిన బల్క్ డ్రగ్ పార్కును నక్కపల్లి ప్రాంతంలో నెలకొల్పి ఈ ప్రాంతాన్ని డంపింగ్ యార్డ్‌గా మార్చాలని చూడటం దుర్మార్గమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నక్కపల్లిలో బల్క్ డ్రగ్ యూనిట్ నెలకొల్పే ప్రతిపాదనలను తక్షణమే విరమించు కోవాలని డిమాండ్ చేశారు.

భద్రాచలం రాములవారి ఆలయంలో సాయికృష్ణ తదితరులు

భద్రాద్రి రాముడిని దర్శించుకున్న సాయికృష్ణ

ప్రజాశక్తి-మునగపాక : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ శనివారం భద్రాచలం పుణ్యక్షేత్రాన్ని సందర్శించి, సీతారామచంద్రస్వామివారి సుప్రభాత సేవలో పాల్గొన్నారు. ఆయన వెంట ఎలమంచిలి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పెంటకోట విజయ్, సాయిరాం, సోము నాయుడు, రమేష్ నాయుడు ఉన్నారు.

గంజాయి కేసులో దంపతులకు నాలుగేళ్ల జైలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అక్రమ గంజాయి తరలిస్తున్న కేసులో ముద్దాయిలకు విశాఖపట్నం సెషన్స్ కోర్టు నాలుగు సంవత్సరాల చొప్పున జైలు శిక్ష, పదివేల రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ శనివారం తీర్పు చెప్పినట్లు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి వి సుధీర్ తెలిపారు. అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం బెన్న భూపాలపట్నం గ్రామానికి చెందిన తాడి అప్పలనాయుడు తాడి లక్ష్మి దంపతులు 2015 సంవత్సరంలో చింతపల్లి మండలం చిత్రాలగొప్పు గ్రామం నుంచి 10 కిలోల గంజాయిని అక్రమంగా తరలిస్తుండగా పట్టుబడ్డారు. నాడు పోలీసులు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దీనిపై విచారించిన విశాఖపట్నం సెషన్స్ కోర్టు నేరం రుజువు కావడంతో నాలుగు సంవత్సరాల జైలు శిక్ష, పదివేల రూపాయల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

రబీలో అపరాలు, నువ్వు సాగుతో అధికాదాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : రబీ సీజన్లో నువ్వులు, అపరాల సాగుతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ సిహెచ్ ముకుందరావు అన్నారు. స్థానిక ఆర్ఎఆర్ఎస్‌లో శనివారం జరిగిన శిక్షణ సందర్శన కార్యక్రమంలో మాట్లాడుతూ డిసెంబర్ నెలలో కురిసిన వర్షాలతో అధిక తేమ ఉండడంతో ఈ పంటలకు అనుకూలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా వ్యవసాయ కార్యాలయ ప్రతినిధి సిహెచ్ సుబ్రహ్మణ్యం, విశాఖ జిల్లా డిఆర్సి ప్రతినిధి హరికృష్ణ, శాస్త్రవేత్తలు రమణమూర్తి, ఆదిలక్ష్మి, భవాని, జగన్నాధ రావు, ఉమామహేశ్వరరావు, ఎంబిజిఎస్ కుమారి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని పూడిమడక సముద్ర తీరంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను జనసేన ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ సుందరపు సతీష్ కుమార్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు, గ్రామ మాజీ సర్పంచ్ చేపల వెంకటరమణ, మాజీ ఎంపిటిసి సభ్యుడు మెరుగు బాపు నాయుడు, జనసేన నాయకులు బి రాందాస్, టెక్కలి పరశురాం, 13 జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులు పాల్గొన్నారు.

సర్వీసు ప్రొవైడర్ల నమోదు

ప్రజాశక్తి-యలమంచిలి : సర్వీసు ప్రొవైడర్ల నమోదు కార్యక్రమం చేస్తున్నట్లు మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సరోజిని అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వీసు ప్రొవైడర్ల నమోదు కార్యక్రమంలో శనివారం ఆమె పాల్గొని మాట్లాడారు. ఇళ్లలో పైపులు కారిపోవడం, విద్యుత్ సమస్యలు, ఫ్రిజ్, వాటర్ ప్యూరిఫైయర్, గీజర్ రిపేరు వంటి మరమ్మతులకు సర్వీసు ప్రొవైడర్లు ఒక్క పిలుపుతో మీ ముందుంటారని తెలిపారు. అందుకే ఈ సర్వీసు ప్రొవైడర్ల గుర్తించి వాటి వివరాలు నమోదు చేసి త్వరలో డిజిటలైజ్ చేసి వారి సేవలు ప్రజల ముందుంచడానికే సర్వీసు ప్రొవైడర్ల రిజిస్ట్రేషన్ కార్యక్రమం చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, యలమంచలి మెప్మా సిఐఒ పద్మావతి, క్లస్టర్ కో ఆర్డినేటర్లు, సూపర్‌వైజర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సుమారు వెయ్యి మంది సర్వీసు ప్రొవైడర్లుగా పేర్లు నమోదు చేసుకున్నారు.

ఘనంగా సెయింట్ జాన్స్ స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట సెయింట్ జాన్స్ పాఠశాల 20వ వార్షికోత్సవం శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఇందులో డిఇఒ అప్పారావునాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ పేటరన్ జాన్ యతి రాజులు, డైరెక్టర్ బత్తుల నోబెల్ కుమార్, చైర్ పర్సన్ బత్తుల అనురాధ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల మేధోశక్తికి వైజ్ఞానిక ప్రదర్శనలు అవసరం

ప్రజాశక్తి-కశింకోట : విద్యార్థుల మేధాశక్తికి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. కశింకోట బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. దీనిని సందర్శించిన కలెక్టర్ పలు పాఠశాల విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు జ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, ఎంపీడీఓ రవి కుమార్, తహశీల్దారు శ్రీనివాసరావు, ఎంఇఒ వెంకటసురేష్, హెచ్‌ఎం స్వర్ణకుమారి, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి : సిపిఎం

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న ఎలక్ట్రికల్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని కోరుతూ సిపిఎం మండలం కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించారు. శనివారం ఎన్టీఆర్ గ్రౌండ్, బెల్లం మార్కెట్, శారదా బ్రిడ్జి, గాంధీ నగర్ తదితర ప్రాంతాల్లో సిపిఎం నాయకులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు బి.ఉమామహేశ్వరరావు, నాయకులు కె.తేలయ్యబాబు మాట్లాడుతూ స్మార్ట్ మేటర్లను పగలగొట్టాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన కూటమి నేతలు, నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్లను బిగించడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికే సర్దుబాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీలు పేరుతో అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, ఇప్పుడు ఆదాని కంపెనీకి ఒప్పందం ప్రకారం ఈస్మార్ట్ మీటర్లు పేరుతో భారాలను మోపొద్దని హితవుపలికారు.

ఎమ్మెల్యే కొణతాల జన్మదినం సందర్భంగా

పలు సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ జన్మదినం సందర్భంగా శనివారం నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు, పూజలు కూటమి నాయకులు నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీసూర్యనారాయణ సత్యనారాయణ దేవస్థానంలో ఆలయ చైర్మన్ బొడ్డేడ మురళి ఆధ్వర్యంలో, శ్రీభోగలింగేశ్వర స్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ కాండ్రేగుల వెంకట సత్యనారాయణ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గాంధీ నగరం జిల్లా పశు వైద్య కార్యాలయం వద్ద అక్షయ సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్, రాజా ఆప్టికల్స్, కంటి ఆసుపత్రి అధినేత పూసర్ల రాజా ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో నేత్రాలు, దంతాలకు సంబంధించిన రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ ఎస్వి.కృష్ణారావు, దంత వైద్యులు కింతాడ భాస్కర్, వైద్యులు లక్ష్మణ్ శ్రీనివాస్, జేవిఎన్ శ్రీనివాసులు, రజనిబాబు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాలు

అనకాపల్లి : స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో శనివారం కళాశాల పూర్వ విద్యార్థి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ జన్మదినం సందర్భంగా మేము సైతం సమాజం కోసం సేవా సంస్థ, ఏఎంఏఎల్ కళాశాల విద్యార్థులు కలిసి రెడ్ క్రాస్ ఇండియా సొసైటీ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని వర్తక సంఘ అధ్యక్షులు కొణతాల లక్ష్మీనారాయణ, కళాశాల కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు ప్రారంభించారు. కళాశాల పూర్వ విద్యార్థులు, పౌరులు, ప్రస్తుత విద్యార్థులు సుమారు 75 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు, వైస్ ప్రిన్సిపాల్ నిరంజన్ కుమార్, ఎన్‌సిసి అధికారులు కెప్టెన్ జగదీశ్వరరావు, కెప్టెన్ ఏఎస్ఎన్ మూర్తి, ఎన్ఎస్ఎస్ అధికారులు ఎ.సూరిబాబు, బిఎమ్‌వివి.నాయుడు, సూపరింటెండెంట్ అనురాధ పాల్గొన్నారు.

తాళ్లపాలెంలో..

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం కళ్యాణ మండపం వద్ద శనివారం తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం జరిగింది. కేక్ కట్ చేసి అభిమానులు పంచారు. అలాగే జాతీయ రహదారి నుండి పరవాడపాలెం గ్రామం వరకు సర్పంచ్ బలిజ మంగ మసిలి నాయుడు సొంత నిధులతో కొబ్బరి మొక్కలు నాటారు. కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బీశెట్టి బాబ్జి, కూటమి నాయకులు ఉగ్గిని రమణ మూర్తి, వేగి గోపికృష్ణ, ఉల్లింగల రమేష్, నైనమశెట్టి రమణరావు, ఎస్‌కే.బాబర్, కలగ సోమేశ్వరరావు, బలిజ మసిలినాయుడు, మళ్ల బాబు, గల్లా రాజు, బుదిరెడ్డి గంగయ్య, కర్రి సత్య నారాయణ, కర్రి గోవింద పాల్గొన్నారు.

బుద్ధుని విగ్రహావిష్కరణ

అనకాపల్లి : అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ జన్మదినం సందర్భంగా శనివారం ప్రముఖ బౌద్ధ ఆరామ క్షేత్రం బొజ్జన్న కొండ వద్ద బుద్ధుని విగ్రహాన్ని జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ భీమరశెట్టి రాంకీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి చదరం నాగేశ్వరరావు, పీలా తాతు నాయుడు, మాజీ సర్పంచ్ కర్రి బాబి, నీటి సంఘం అధ్యక్షులు పీలా సీతారాం, మాజీ ఏపీపీ పిళ్ల హర శ్రీనివాసరావు, బొడ్డపాటి రామ్కుమార్, ఆడారి గోవిందరావు, పల్లెల గణేష్, బుదిరెడ్డి సూరిబాబు, పీలా విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుని విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జనసేన నేత రాంకీ

వెంకన్నపాలెంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-చోడవరం రూరల్ : చోడవరం మండలం వెంకన్నపాలెం గ్రామంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం కాలువలను శుభ్రం చేశారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాలను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి జె.గంగాధర్, సర్పంచ్ మొల్లి ఈశ్వరరావు, ఎంపిటిసి మురిగిని రమణ, ఆశా కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని పి.భీమవరంలో గల సంపద తయారీ కేంద్రాన్ని శనివారం మండల ప్రత్యేకాధికారి గోపాల్, ఎంపిడిఒ విజయలక్ష్మి పరిశీలించారు. అనంతరం ఆ గ్రామ సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. రోడ్లకు ఇరువైపులాగా తుప్పలను తొలగించారు. పారిశుధ్యాన్ని సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపిఆర్డి విజయలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్వాడీలో చేర్పాలి

ప్రజాశక్తి-యలమంచిలి : మండలంలోని ఎర్రవరం అంగన్వాడీ కార్యకర్త వినూత్న ప్రయోగం చేస్తున్నారు. అంగన్వాడీ పరిధిలోని మూడేళ్లు నిండిన పిల్లలకు అంగన్వాడీ సెంటర్లోనే బర్త్‌డే కేక్ కట్ చేసి ఆ తర్వాత రోజు నుండి ప్రతి రోజు అంగన్వాడీకి హాజరయ్యేలా చూస్తున్నారు. శనివారం ఓ బాలుడికి బర్త్‌డే కేక్ కట్ చేసి మహిళలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు.

నేటి రోడ్డు రవాణా రంగ సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పరవాడ

రోడ్డు రవాణా రంగ కార్మికుల సమస్యలపై ఈ నెల 5న అనకాపల్లిలో జరుగు సదస్సుకు ఆ రంగ కార్మికులు అధిక సంఖ్యలో వచ్చి జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. సదస్సు కరపత్రాలను శనివారం మండలంలోని వాడచీపురుపల్లి ఆటో స్టాండ్ వద్ద ఆటో యూనియన్ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థలో రోడ్డు రవాణా రంగం కీలక పాత్ర పోషిస్తుందని, ఈ రంగంలో పనిచేసే కార్మికుల సమస్యలపై జరుగుతున్న ఈ సదస్సుకు అఖిల భారత రోడ్ ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య, రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ హాజరవుతున్నారని తెలిపారు.

రాంబిల్లి : రాంబిల్లి మండల కేంద్రంలో శ్రీకనకదుర్గ ఆటో యూనియన్ అధ్యక్షులు రమణ ఆధ్వర్యంలో శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేవుడునాయుడు మాట్లాడుతూ ఆటో, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు ప్రభుత్వం సమగ్ర చట్టం చేయాలని, ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన రవాణా ట్రాన్స్‌పోర్ట్ చట్టం నుండి, బిఎన్ఎస్ రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సుకు ఆటో, లారీ, ట్రాక్టర్, వ్యాన్, మ్యాజిక్ డ్రైవర్లు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు మాధవరావు, అప్పారావు, తాతారావు, తాతాజీ, శేషు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి : 5న అనకాపల్లిలో జరిగే రవాణా రంగ కార్మికుల జిల్లా సదస్సుకు పెద్ద ఎత్తున కార్మికులు తరలి రావాలని కోరుతూ శనివారం దిమిలి ఆటోస్టాండ్ వద్ద కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి చింతకాయల శివాజీ మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థలో రవాణా రంగం కీలక భూమిక పోషిస్తోందని, ఆ రంగంలో పని చేస్తున్న ఆటో, మోటారు, బస్, లారీ, వ్యాన్ డ్రైవర్ల సంక్షేమాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గాలికొదిలేయడం అత్యంత విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల కన్వీనర్ ఎం.శ్రీనివాస్, సిఐటియు నాయకులు గంగాధర్, ఆటో కార్మికులు లోవరాజు, అనిల్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వాడ చీపురుపల్లిలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గనిశెట్టి, ఆటో కార్మికులు

కొత్తకోట : మోటార్ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ తో ఈ నెల 5 న అనకాపల్లి లో సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ శనివారం సిఐటియు ఆధ్వర్యంలో రావికమతం మండలం కొత్తకోటలో కర పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ మోటార్ రవాణా రంగంలో పని చేసే కార్మికులను నాశనం చేసే నల్ల చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట శ్రీశాంతి ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు..

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కాశీపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హెచ్ఎం సుందరి, ట్రస్టు చైర్మన్ గొంప వెంకట్రావు చేతులు మీదుగా డిసిఈబి స్టడీ మెటీరియల్ శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు జూరెడ్డి దివాకర్, కర్రి ధారప్రసాద్, కర్రి పూజ, యడ్ల స్వాతి, ఉపాధ్యాయులు రాము, సుజాత, రామలక్ష్మి, సత్యవతి, పూర్ణిమ, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాలో ప్రపంచ నిషేధిత పరిశ్రమలు పెట్టొద్దు

ప్రజాశక్తి-దేవరాపల్లి : జిల్లాలో ప్రపంచం నిషేధించిన కంపెనీలను పెట్టే ఆలోచనను విరమించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ నెల 8న విశాఖ పర్యటనతో అనకాపల్లి జిల్లా పూర్తిగా కాలుష్య కోరల్లో మునగబోతుందని, ఉన్న పరిశ్రమలు మూసివేసి యువతకు ఉపాధి అవకాశాలు పేరుతో ప్రపంచంలో నిషేధిత కంపెనీలకు ఇక్కడ ప్రారంభించడానికి శంకుస్థాపన చేయబోతున్నారని తెలిపారు. అనకాపల్లి పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడ్డ జిల్లా అని, అటువంటి జిల్లాలో వ్యవసాయానికి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయవలసింది పోయి ప్రపంచంలోనే నిషేధించిన అత్యంత ప్రమాదకరమైన ఫార్మా కంపెనీలు తీసుకొస్తున్నామని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ చెప్పడం దారుణమన్నారు. ఇప్పటికే పరవాడ, అచ్యుతాపురం, నక్కపల్లి ప్రాంతాలు మొత్తం ఫార్మా కంపెనీలతో కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు కాకుండా మరింత కాలుష్యాన్ని విడుదల చేసే పరిశ్రమలను పెట్టడం సరికాదని, ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జాతీయ యువజనోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-సబ్బవరం : విశాఖపట్నం రామకృష్ణ మిషన్ ఆశ్రమం పరిధిలో ఉన్న విద్యాసంస్థల్లో జనవరి 12 వరకు నిర్వహిస్తున్న జాతీయ యువజనోత్సవాల్లో అందులో తొలి ఉత్సవాలు స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో శనివారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇన్‌కం టాక్స్ కమిషనర్ ఎన్.శ్రీధర్, మాట్లాడుతూ యువతకు మార్గదర్శి అయిన స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని ఎదగాలన్నారు. వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ స్వామి వివేకానంద చెప్పినట్టుగా యువత ఒక స్థిర నిర్ణయం, విశ్వాసం కలిగి ఉంటే ఏదైనా సాధించవచ్చు చెప్పారు. కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామిశ్వాసంవియానానంద, అడ్వకేట్ రాంబాబు, ఎం.సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

ఎంఇఒను కలిసిన యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-మునగపాక : మండల విద్యాశాఖాధికారి బి.శివనాయుడును యుటిఎఫ్ మండల నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. యుటిఎఫ్ ప్రచురించిన క్యాలెండర్, డైరీ ఆయనకి అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు మాటూరు సత్యనారాయణమూర్తి, పీల ఆశ, వెంకటరమణ, జివిఎస్ ప్రకాష్, రవివర్మ పాల్గొన్నారు.

అంగన్వాడీ చిన్నారులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలో గల రాజాం, కెపి అగ్రహారం గ్రామాల అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం మంజూరు చేసి పుస్తకాలు, ఆట వస్తువులను శనివారం చిన్నారులకు శనివారం పంపిణీ చేసారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు, ఆకుల నాగేశ్వరావు పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని మూలపేట అంగనవాడి కేంద్రంలో శనివారం ఎర్లీ చైల్డ్ ఎడ్యుకేషన్ పూర్వకాలం విద్య అను కార్యక్రమంలో భాగంగా పిల్లలకు ఆట వస్తువులు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బీశెట్టి గంగ అప్పలనాయుడు, కూటమి నాయకులు ఆడారి జనార్ధన్ రావు, సరగడం నాగేశ్వరరావు, బీసెట్టి నాగేశ్వరరావు, అంగన్వాడీ టీచర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని వినతి

ప్రజాశక్తి-వడ్డాది : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని కాంట్రాక్టు లెక్చరర్లు శనివారం వడ్డాదిలో ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజుకు, స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబుకు వినతిపత్రం సమర్పించారు. 2001 నుండి తాము పని చేస్తున్నామని, జీవో నెంబర్ 114 ప్రకారం ఇతర శాఖల సిబ్బంది మాదిరిగా తమను కూడా క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ లెక్చరర్లు నరసింహామూర్తి, కె.సునీత, సుధీర్, ముత్యాలమ్మ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ యాజమాన్యానికి

కూటమి ఎమ్మెల్యేలు వంతపాడటం సరికాదు

ప్రజాశక్తి-మునగపాక : అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న విశాఖ డెయిరీ యాజమాన్యానికి టిడిపి కూటమి ఎమ్మెల్యేలు వంతపాడటం సరికాదని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు అన్నారు. ఈ మేరకు స్థానిక 'పాటిదిబ్బ' ప్రాంత పాడి రైతులతో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ డెయిరీ సేకరిస్తున్న ఆవుపాల ధరను తగ్గిస్తే విశాఖ డెయిరీ వద్ద పాడి రైతులు రెండు దఫాలు ఆందోళన నిర్వహించిన నేపథ్యంలో ధరను పెంపుదల చేస్తామని ఇచ్చిన హామీ నేటికీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. విశాఖ డెయిరీ యాజమాన్యం అవినీతి, అక్రమ చర్యలను అరికట్టి రైతులను ఆదుకోవాలని ఆందోళనలు చేయగా, రాష్ట్ర ప్రభుత్వం డెయిరీ కార్యకలాపాలపై హౌస్ కమిటీ వేసి విచారణ కూడా నిర్వహిస్తుందని గుర్తు చేశారు. హౌస్ కమిటీ విచారణ నడుస్తున్న సమయంలో కూటమి ప్రభుత్వంలోని శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్, బండారు సత్యనారాయణ మూర్తి విశాఖ డెయిరీ యాజమాన్యాన్ని కొనియాడుతూ ప్రకటనలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. హౌస్ కమిటీ విచారణ కాకముందే కూటమి శాసనసభ్యులు విశాఖ డెయిరీ యాజమాన్యానికి వెన్నుదన్నుగా మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వివి శ్రీనివాసరావు, ఎస్.బ్రహ్మాజీ, రైతులు పాల్గొన్నారు.

ఆడారి తులసీరావు వర్ధంతి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని బోయిలకింతాడ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం కేంద్రంలో విశాఖ డెయిరీ పూర్వ చైర్మన్ ఆడారి తులసీరావు వర్ధంతి కార్యక్రమం వైసిపి మండల అధ్యక్షులు, ఆ గ్రామ సర్పంచ్ బూరె బాబురావు ఆధ్వర్యాన శనివారం నిర్వహించారు. తులసీరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దాసరి వెంకటరమణ, పి.రాము నాయుడు, పెంటకోట అప్పలనాయుడు, కొప్పు ఈశ్వరమ్మ రైతులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉన్న వ్యక్తికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి మండలంలోని పెదమదిన గ్రామానికి చెందిన యువకులు ఆర్థిక సహాయం చేశారు. గ్రామానికి చెందిన దోసూరి సత్తిబాబు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆ గ్రామానికి చెందిన వియ్యపు అప్పారావు, ఎంపిటిసి వియ్యపు మరిడిబాబు ప్రోత్సాహంతో గ్రామానికి చెందిన పలువురు యువకులు కలిసి రూ.13వేలు అందజేశారు.

ఘనంగా లూయీ బ్రెయిలీ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-పరవాడ

మండల కేంద్రం పరవాడ భవిత కేంద్రంలో లూయీ బ్రెయిలీ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. భవిత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, వికలాంగులు కేక్ కట్ చేశారు. "వెలువెల్లి ఫౌండేషన్" వారు వికలాంగులకు స్టేషనరీ ఐటమ్స్ అందజేశారు. టి.భాస్కర్‌రావు దంపతులు భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో అంధుల సమాఖ్య ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు ఎస్ అర్జున్‌రావు, ఎంఇఒ-2 సాయి శైలజ, వెలువల్లి ఫౌండేషన్ ఫౌండర్ రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎపి అంధుల సమాఖ్య ఆధ్వర్యంలో పరవాడ మరిడిమాంబ కల్యాణ మండపంలో లూయీ బ్రెయిలీ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నేత పంచకర్ల ప్రసాద్, జెడ్‌పిటిసి పైల సన్యాసిరాజు, ఎంపిపి పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాస్, సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక భవిత కేంద్రంలో లూయీ బ్రెయిలీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ లెక్కల పద్మ భవిత కేంద్రానికి రూ.11వేలు విలువ చేసే ప్రింటర్‌ని అందజేశారు. భవిత వికలాంగ విద్యార్థిని ప్రశాంతి తండ్రి రాంబాబు భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎం.జె.రవీంద్రబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చోడవరం : స్థానిక భవిత కేంద్రంలో ఎంఇఒ కె.సింహాచలం, హైస్కూల్ హెచ్ఎం ఐవి.రామిరెడ్డి లూయీ బ్రెయిలీ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో భవిత కేంద్రం ఉపాధ్యాయుడు సత్యనారాయణ, ఐఈఆర్పి రమేష్, నాయుడు, రవిశంకర్ పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి అప్పారావు, ప్రత్యేక బోధనా ఉపాధ్యాయురాలు షేక్ యాస్మిన్ ఆధ్వర్యంలో ప్రపంచ బ్రెయిలీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొలుగొండ : స్థానిక భవిత కేంద్రంలో బ్రెయిలీ దినోత్సవం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జోగంపేట హైస్కూలు హెచ్ఎం వి.సరోజినీ బ్రెయిల్ కృషిని వివరించారు. .కార్యక్రమంలో ఎంపీయుపి పాఠశాల హెచ్ఎం కె. రాజుబాబు, స్పెషల్ ఎడ్యుకేటర్ అప్పారావు, ఐఆర్పి కె.రమణి, ఎస్ఆర్పిలు సత్యనారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఎ.ఎల్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కూడా బ్రెయిలీ దినోత్సవాన్ని ప్రత్యేక ఉపాధ్యాయులు తమ్మిల మాణిక్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగభూషణం పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు 1, 2 ఎం.శివరాణి, జయప్రద, భవిత కేంద్రం ఐఈఆర్‌పిలు కె.జియాకుమారి, పార్వతి, సిఆర్‌పి శివదయాళ్, ఉపాధ్యాయులు రామస్వామి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు

ఆనందపురం : ఆనందపురం మండలం భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. కోరాడ అప్పలస్వామి నాయుడు రూ.1,000 ప్రోత్సాహకం అందజేశారు. ఆనందపురం గ్రామానికి చెందిన కె.సత్యమూర్తి ఆట వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ కె.గంగరాజు, సిఆర్‌పి గౌరీశంకర్, ఉపాధ్యాయులు బి.ముత్యాలనాయుడు, కె.శ్రీనివాసరావు, ఐ.నాగమణి పాల్గొన్నారు.

చింతలపాలెంలో కృత్రిమ కాలు అందజేస్తున్న దృశ్యం

వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యాన

కశింకోట : వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) ఆధ్వర్యాన మండలంలోని చింతలపాలెంలో లూయీ బ్రెయిలీ జయంతి ఘనంగా నిర్వహించారు. బాగవతుల ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్లు, కృత్రిమ కాలు, వీల్ చైర్ పంపిణీ చేశారు. ముందుగా లూయీ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పిఆర్‌డి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగిడి నూక అప్పారావు, జిల్లా నాయకులు. షేక్ రెహమాన్, ముత్యాల రాజుబాబు, జె.సత్యం, ఎం.ఈశ్వరావు, బుద్ద ధనలక్ష్మి, రాపేట్ భాస్కర్‌రావు, పెట్ల సన్యాసిరావు, నల్ల కుమారి, గ్రామ సర్పంచి కొట్టె రాము, కొట్టె సత్యనారాయణ, ఎస్‌కే ఇస్మాయిల్ పాల్గొన్నారు.

కశింకోట భవిత కేంద్రం వద్ద లూయీ బ్రెయిలీ జయంతి సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. పిల్లలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నెంబర్-2 స్కూల్ హెచ్ఎం రాములునాయుడు, ఐఈఆర్‌టి ఉపాధ్యాయులు బివి.రమణమ్మ, శంకరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ కాలేజీల్లో మెరుగైన విద్యా బోధన

-స్పీకర్ అయ్యన్న, మంత్రులు అనిత, డోలా -డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

సబ్బవరంలో ప్రారంభిస్తున్న మంత్రి అనిత

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:ప్రభుత్వ కాలేజీలు, పాఠశాలల్లో మెరుగైన బోధన అందిస్తున్నారని, ఇక్కడ చదివిన వారు ఐఎఎస్, ఐపీఎస్ ఆఫీసర్లు అయ్యారని సభాపతి అయ్యన్నపాత్రుడు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అయ్యన్న శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నర్సీపట్నం కి చెందిన మౌర్య భరద్వాజ్ ఐఎఎస్‌గా సెలెక్ట్ అయ్యారని, ఐపీఎస్‌కు కిల్లాడ సత్యనారాయణ సెలెక్ట్ అయ్యారని మీరందరూ స్ఫూర్తిగా తీసుకొని మంచి భవిష్యత్తు సాధించాలన్నారు. డొక్కా సీతమ్మ అనే మహిళ ఎంతోమందికి ఉచితంగా భోజనం పెట్టి వారి ఆకలి తీర్చేదని ఆమె సేవకు చిహ్నంగా ఈ కార్యక్రమానికి ఆమె పేరు పెట్టారన్నారు. రాష్ట్రంలో 475 కళాశాలలోను మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించినట్లు తెలియజేశారు. దీనికి 85 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పద్మావతి, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రాజన్న వీర సూర్య చంద్ర, కాశీ నాయుడు, కౌన్సిలర్ డబ్బీరు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి:నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకాన్ని ఎంపీపీ రత్నం, సర్పంచ్ జయ రత్నకుమారి, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ,విద్యార్థులు చదువులో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీదేవి పాల్గొన్నారు.

కొత్తకోట:విద్యార్థులందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యవతి అన్నారు. కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పలువురు నాయకులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం టిడిపి మహిళ అధ్యక్షురాలు కోట నీలవేణి గోవిందరావు, సర్పంచ్ లోవరాజు, ఎంఈఓ బ్రహ్మాజీ, హెచ్ఎం నాగేశ్వరరావు, తలారి ఆదిమూర్తి, మండల టిడిపి అధ్యక్షులు రాజాన కొండనాయుడు, గ్రామ టిడిపి నాయకులు కోట సత్యనారాయణ, వెల్లంకి ఈశ్వరరావు,ఉగ్గిన శ్రీను, బంటు శ్రీను,కలం నర్సింగ రాజు,హైస్కూల్ చైర్మన్ దుప్పట్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు...

కోటవురట్ల: విద్యా వ్యవస్థను అన్ని రాజకీయ పార్టీలు గౌరవించుకోవాలని మండల టిడిపి అధ్యక్షులు జానకి శ్రీను కోరారు. మండల కేంద్రంలో గల జూనియర్ కళాశాల లో మధ్యాహ్న భోజన పథకాన్ని స్థానిక సర్పంచ్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో లాంఛనంగా ప్రారంభించారు.కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, ఎంఈఓ రామారావు, ఎంపీటీసీ సభ్యులు సూర్యారావు పాల్గొన్నారు.

మాడుగుల : డొక్కా సీతమ్మ పేరిట మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, దూర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు ఈ పథకం ఉపయోగ పడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి ఉండూరు దేవుడు, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి రొబ్బ మహేష్, కేజేపురం ఎంపీటీసీ బీసెట్టి శ్రీనివాసరావు, లెక్కల కాశీ బాబు పాల్గొన్నారు.

రావికమతం :మండలంలో మరుపాక ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ కాసెట్టి రాజు, ప్రిన్సిపాల్ సునీల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ కాశెట్టి రాజు పాల్గొన్నారు.

గొలుగొండ:గొలుగొండ మండలం కృష్ణదేవిపేట జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని పథకాన్ని ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గజ్జలపు మణికుమారి, సర్పంచ్ లోచల సుజాత, కళాశాల, ఉప సర్పంచ్ కొండమ్మ, టీడీపీ నాయకులు పెట్ల నారాయణమూర్తి, బొడ్డు జమీలు, గాడి అప్పలనాయుడు, చిటికెల చిట్టిబాబు, పోతల రాజులనాయుడు, స్కూల్ చైర్మన్లు స్వామినాయుడు, లగుడు రాజులనాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ కె.హరి, అదనపు ప్రిన్సిపాల్ రుత్తల గంగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రోలుగుంటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

రోలుగుంట:రోలుగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకంను శనివారం చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కార్యక్రమం విద్యార్థులకు ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సబ్బవరం:స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని శనివారం రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం హోం మంత్రి అనిత స్థానిక పోలీస్ స్టేషన్ను సందర్శించారు. పోలీసులు విధులు సక్రమంగా నిర్వహించి మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు, గంజాయి నివారణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి, కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఎంపిపి బోకం సూర్యకుమారి, తహశీల్దారు బి.చిన్నికృష్ణ, ఎంపీడీవో పి.పద్మజ, సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, కాలేజ్ ప్రిన్సిపాల్ మురళీధర్, టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.

చోడవరం : స్థానిక జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో టిడిపి నేత జి.మల్లునాయుడు, ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో జి ఆంజనేయులు, కాలేజ్ ప్రిన్సిపల్ ఉమాదేవి, పంచాయతీ ఇఓ నారాయణరావు, మాజీ జెడ్పిటిసి కనిశెట్టి సన్యాసిరావు పాల్గొన్నారు.

గొలుగొండలో

విశాఖలో ప్రారంభిస్తున్న మంత్రి డోలా

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది జూనియర్ కాలేజీలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు, స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబుతో కలిసి శనివారం ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వైవిఎల్ అన్నపూర్ణ, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, కూటమి నేతలు దొండా సన్యాసిరావు, దాడి సూర్య నాగేశ్వరావు, దొండా నరేష్, పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం భోజన పథకాన్ని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగమణి, టిడిపి నాయకులు రొంగళి మహేష్, జురెడ్డి రాము, డోకల నరసింహమూర్తి, కన్నూరు సూర్యనారాయణ పాల్గొన్నారు.

దేవరాపల్లి : స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని మాజీ ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ నిర్మల, ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మీ, జడ్పిటిసి కర్రి సత్యం, టిడిపి నాయకులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, చల్ల నానాజీ పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం భోజన పథకాన్ని శనివారం రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గోవింద సత్యనారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం..

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాంప్రసాద్, అధ్యాపకులు, కార్పొరేటర్లు గాడు చిన్ని కుమారి లక్ష్మి, గంటా అప్పలకొండ, దౌలపల్లి కొండబాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు సహకారం

విశాఖ కలెక్టరేట్ : ఉన్నత విద్యకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలను అందివ్వనుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. డాబాగార్డెన్స్‌లోని విశాఖ ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎడ్యుకేషనల్ కిట్స్ అందజేయనున్నట్లు తెలిపారు. విద్యలో మరింత మెరుగు పడేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో టీచర్లు మమేకం కావాలన్నారు. పిల్లల అలవాట్లను పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. రక్తహీనత కలిగిన వారికి మందులు పంపిణీ చెయ్యాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న అధికారులు

వర్చువల్ మీట్‌కు ఏర్పాట్లు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో ఏర్పాటు చేయనున్న బల్క్ డ్రగ్ పార్క్ ను ఈనెల 8వ తేదీన విశాఖపట్నంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శంకుస్థాపన చేయనున్నారు. విశాఖలో జరిగే ఈ కార్యక్రమాన్ని వర్చువల్ గా నిర్వహించి, స్థానిక ప్రజలతో ప్రధాని ముఖాముఖి నిర్వహించనున్నారు. ఈ మేరకు రాజయ్యపేట సమీపంలో బోయపాడు వెళ్లే మార్గంలో వర్చువల్ మీట్‌కు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం మండల ప్రత్యేక అధికారి పి ప్రసాద్, ఎంపీడీవో డి.సీతారామరాజు, ఆర్ఐ కన్నబాబు, ఇన్చార్జి ఇఓపిఆర్డి ఎం శ్రీను లతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఏర్పాట్లను పర్యవేక్షించారు. వర్చువల్ మీట్‌కు సుమారుగా 2000 మంది హాజరయ్యే విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాని ప్రజలతో ముఖాముఖి నిర్వహించేందుకు బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

కాలువ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్

రూ.15 లక్షలతో కాలువ నిర్మాణం

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం టి. అర్జాపురంలో సుమారు రూ 15 లక్షల నిధులతో భారీ సిసి కాలవ నిర్మాణం చేపట్టినట్లు గ్రామ సర్పంచ్ మడగల అర్జున (పొల్లిగ) తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ఏర్పాటు నుంచి తమ గ్రామానికి సరైన సిసి కాలవలు లేవన్నారు. సుమారు 10 వేలకు పైగా జనాభా కలిగిన గ్రామంలో సిసి కాలవలు నిర్మాణం చేపట్టక పోవడం తో డ్రైనేజ్ వ్యవస్థ లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. తొలి దశలో గ్రామ రామాలయం నుంచి చింతకానిపాలెం గ్రామ సరి హద్దు చెరువు వరకూ సుమారు 400 మీటర్లు దూరం సిసి డ్రైన్ మెయిన్ కాలవ నిర్మాణం చేపట్టా మని సర్పంచ్ చెప్పారు. ఈ నిర్మాణానికి సుమారు 15 లక్షలు 15 వ ఆర్థిక సంఘం, మండల పరిషత్ నిధులు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. ఈ సిసి డ్రైనేజీ మెయిన్ కాలవ నిర్మాణంతో సుమారు ఎనిమిది వార్డుల ప్రజలకు డ్రైన్ వ్యవస్థ అందుబాటులోకి రానుందని సర్పంచ్ పేర్కొన్నారు.

మాట్లాడుతున్న నియోజకవర్గ ప్రత్యేక అధికారి

ప్రధాని పర్యటనపై సమీక్ష

ప్రజాశక్తి- మాడుగుల: ఈనెల 8న దేశ ప్రధాని నరేంద్రమోడీ పర్యటనకు జన సమీకరణపై శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కొంకి అప్పారావు ఆధ్వర్యంలో సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గ ప్రత్యేక అధికారి మోహన్‌రావు, జిల్లా వ్యవసాయ, కోపరేటివ్ అధికారి ఎ.ప్రేమ స్వరూపారాణి హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సమావేశానికి హాజరయ్యే ప్రజలకు కల్పించవలసిన సౌకర్యములు, భద్రతపై పలు సలహాలు సూచనలు అందించారు.

సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి -నక్కపల్లి:పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారి పి ప్రసాద్ అన్నారు. మండలంలోని అమలాపురం, రాజయ్యపేట సచివాలయాలను శనివారం ఎంపీడీవో డి సీతారామరాజు, ఇన్చార్జి ఇఓపిఆర్డి ఎం.శ్రీనులతో కలిసి సందర్శించారు. అమలాపురంలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం సచివాలయంలో రికార్డును పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.

ప్రత్యేకాధికారి సమీక్ష

ప్రజాశక్తి- నక్కపల్లి:మండల పరిషత్ కార్యాల యంలో మండల ప్రత్యేక అధికారి పి ప్రసాద్ శనివారం ఎంపీడీవో డి సీతారామరాజుతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ, ఉపాధి, వెలుగు, హౌసింగ్, పంచాయతీరాజ్, ఐసిడిఎస్ అధికారులతో శాఖల వారీగా నిర్వహిస్తున్న పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపడుతున్న పనులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కన్నబాబు, ఇంచార్జ్ ఈవోపీఆర్డి ఎం శ్రీను, వెలుగు ఏపిఎం శ్రీనివాస్, ఉపాధి ఏపీఓ భాగ్యలత, హౌసింగ్ ఏఈ జగన్, వర్క్ ఇన్స్పెక్టర్ నరేంద్ర పాల్గొన్నారు.

ఉపమాకకు పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో శనివారం భక్తుల పోటెత్తారు. పెద్ద సంఖ్యలో భక్తుల వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు గోపాలాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఇత్తడి గరుడ వాహనంపై స్వామివారి తిరువీధి సేవ నిర్వహించారు.

ఆలయంలో భక్తులు

చిన్నారులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి వీవర్స్ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో శనివారం (ఈసీసీఈ)బాల్య సంరక్షణ, విద్య కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి పి ప్రసాద్, ఎంపీడీవో డి సీతారామరాజు హాజరయ్యారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు అందిస్తున్న కార్యక్రమాలపై చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలకు పిపి1, పి పి 2 పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు లలిత, సత్య, అంగన్వాడి టీచర్ దుర్గారాణి పాల్గొన్నారు.

క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు ప్రారంభం

ప్రజాశక్తి -కోటవురట్ల: కోటవురట్ల ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో రత్నాల పాలెం ప్రీమియర్ లీగ్ పోటీలను శనివారం మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు, మండల టిడిపి అధ్యక్షులు జానకి శ్రీను, స్థానిక ఎస్సై రమేష్ ప్రారంభించారు. సంక్రాంతి సందర్భంగా జరిగే ఈ క్రికెట్ పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి 35000 అందజేస్తున్నట్లు నిర్వాహకులు గారా ఆనంద్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఆనందాన్ని పెంపొందించడమే కాకుండా స్నేహ భావాన్ని నెలకొలుపుతాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అనిల్ కుమార్, ఎంపీటీసీ సభ్యులు సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న నాయకులు

చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

గ్రామ వార్డు వాలంటీర్లను కొనసాగించాలి
సిఐటియు రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:గ్రామ వార్డు సచివాలయ వాలంటీర్లను యథావిధిగా కొనసాగించాలని, చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, గ్రామ వార్డు సచివాలయాలలో పని చేస్తున్న వాలంటీర్లను యథావిధిగా విధుల్లో కొనసాగించాలని కోరుతూ, రెండవ రోజైన శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఎపి గ్రామ వార్డు వాలంటీర్ల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో నిరాహార దీక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దయా రమాదేవి మాట్లాడుతూ, వాలంటీర్లకు కనీస వేతనం రూ.10 వేలు చెల్లించాలన్నారు. ఎన్నికల ముందు వాలంటీర్ల చేత జగన్మోహన్ రెడ్డి వెట్టిచాకిరి చేయించుకుంటున్నారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వారి జీవితాలు మెరుగుపడే విధంగా గౌరవప్రదంగా బ్రతికేటట్లు చూస్తామని రూ.10 వేలు వేతనాలు అమలు చేస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారన్నారు. కానీ ఆరు నెలలు గడుస్తున్నా, ఇంతవరకూ వాలంటీర్లకు పనులు చెప్పకపోవడం, జీతాలు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. వీరంతా ప్రభుత్వం నియమించిన వారేనని, రాజకీయ కార్యకర్తలు కాదన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి వారిదిగా పనిచేసిన వాలంటీర్లను విధుల నుంచి తొలగించడం అన్యాయం అన్నారు. తక్షణమే వీరందరినీ యథావిధిగా విధుల్లో కొనసాగించాలని, బకాయి ఉన్న 7 నెలల జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు.
సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్, ఉపాధ్యక్షుడు జి. అప్పలరాజు మాట్లాడుతూ, వాలంటీర్లు చేపట్టిన పోరాట కార్యక్రమానికి సిఐటియు అండగా ఉంటుందన్నారు.
సిఐటియు జిల్లా కార్యదర్శి పి.మణి మాట్లాడుతూ, వాలంటీర్లలో అత్యధిక మంది బాగా చదువుకున్న మహిళలు ఉన్నారన్నారు. వీరందరినీ ఉద్యోగాల నుంచి తొలగించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.దీప్తి, కోడూరు రాము, అజార్, ఆంజనేయులు పార్వతి,కె.లక్ష్మణ్,ఆదిలక్ష్మి, శ్యామ్, వాసు, రాజు తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో దీక్షలు చేపట్టిన వాలంటీర్లు

అనకాపల్లిలో ఆందోళన చేపడుతున్న వాలంటీర్లు

అనకాపల్లి : తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు తమను కొనసాగించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద వాలంటీర్లు శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో ఆయిషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు, వాలంటీర్ల యూనియన్ జిల్లా కన్వీనర్ ఎస్.కె పీర్ సాహెబ్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే గ్రామ, వార్డు వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, నెలకు పదివేల రూపాయలు జీతం ఇస్తామని చేసిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దానిని అమలు చేయాలని కోరారు. బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం సిహెచ్.కొర్లయ్య, ఏ.అప్పారావు, ఎస్.జ్యోతి, జి.నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మి ఆలయ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:ఓల్డ్ టౌన్ బురుజుపేటలో ప్రసిద్ధి చెందిన కనకమహాలక్ష్మి దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమం శనివారం జరిగింది.గత నెల 23 నుండి ఈనెల 4 వ తేదీ వరకు 12 రోజులకు గాను చేపట్టిన లెక్కింపులో నగదు రూ.40 లక్షల,89 వేల 462 వచ్చాయని, బంగారం 96 మిల్లీ గ్రాములు, వెండి 1 గ్రాము 275 మిల్లీ గ్రాములు కానుకలు వచ్చాయని, దేవస్థానం కార్య నిర్వహణ అధికారి కె. శోభారాణి మీడియాకు తెలిపారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వాహణాధికారిణి కె.శోభారాణి, సహాయ కార్య నిర్వహణ అధికారి కె.తిరు మల్లేశ్వరరావు, పోలమాంబ అమ్మవారి దేవస్థానం కార్యనిర్వాహణాధికారిణి కె.గాయత్రి, ఎవిఎన్ కాలేజీ యూనియన్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ డేవిడ్ రాజు,వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.
ఇది ఇలా ఉండగా కనకమహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానం అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి నగరానికి చెందిన ఎన్. వెంకటరమణి పద్మజ రూ. లక్ష విరాళం చెక్కు రూపంలో ఆలయ కార్యనిర్వహణాధికారిణి కె.శోభారాణి కి అందజేశారు.

లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ఆర్ల నుండి పిత్రిగెడ్డకు రోడ్డు మంజూరు

-సిపిఎం పోరాట విజయం

ప్రజాశక్తి-రోలుగుంట:సీపీఎం చేసిన నిరంతర పోరాటానికి ఎట్టకేలకు స్పందన వచ్చింది. రోలుగుంట మండలం ఆర్ల నుండి పిత్రిగడ్డ రోడ్డు మంజూరు అయింది. దీనిపై పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీరునాయుడ, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు శనివారం కాలినడకన గ్రామాలను సందర్శించారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.4కోట్లా 10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు అధికారులు తెలిపాఉ. అల్లూరు జిల్లా కొయ్యూరు మండలం మూలపేట పంచాయతీ జాజులబంద గ్రామంలో ఈ నెల 1న పది రోజులు పాప మృతి చెందిన విషయంపై సీఎం కార్యాలయం నుండి అల్లూరు జిల్లా కలెక్టర్‌కి ఈ రోడ్డు సమస్యపై మాట్లాడారు. ఈ మేరకు పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రోడ్డును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే.గోవిందరావు, స్థానిక గిరిజన నాయకులు కొండ తాంబిల్లి వెంకటరావు, కిలో రాజు పాల్గొన్నారు

పర్యటిస్తున్న అధికారులు

పావు కిలో వెండి వితరణ

ప్రజాశక్తి - మాడుగుల:మండలంలోని ఎం కోడూరు. మోదకొండమ్మ అమ్మ ఆలయానికి అదే గ్రామానికి చెందిన సేనాపతి కాసన్న, లక్ష్మి దంపతుల కుమారుడు సేనాపతి దుర్గి నాయుడు, పద్మ దంపతులు కుమారులు రాజేష్, మహేష్ లు పావు కిలో వెండిని ఆలయ కమిటీ చైర్మన్, గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకు శనివారం విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జొన్నపిల్లి నాగరాజు, ముమ్మిన రవణ బాబు, బొడ్డు రమణబాబు, అప్పలరాజు పాల్గొన్నారు.

ప్రతి పంచాయతీలో ఉగాది సంబరాలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: సాంప్రదాయ బద్ధంగా తెలుగు సంవత్సరాది జరుపుకోవడం తెలుగు ప్రజలకు మంచిదని శాసనసభాధిపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలోని 14 వేల పంచాయతీలలో ఈ ఏడాది ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించాలని అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. తెలుగువారి పండుగ ఉగాది ప్రాముఖ్యతను, సాంప్రదాయాలను అనేకమంది తెలుగు ప్రజలు మర్చి పోతున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది రాష్ట్రంలోని ప్రతి పంచాయతీలో ఉగాది సంబరాలు, పంచాంగ శ్రవణం జరిపించేలా ఆదేశాలు ఇవ్వాలని సిఎంకు లేఖ రాస్తున్నట్లు స్పీకర్ వెల్లడించారు.

అన్న క్యాంటీన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి- మాడుగుల: అన్న క్యాంటీన్ ఏర్పాటుకు శనివారం మండల కేంద్రంలో స్థానిక అధికారులు, నాయకులతో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి స్థల పరిశీలన చేశారు. రూ 61 లక్షలతో అన్నా క్యాంటీన్ ఏర్పాటు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. ఎంపీడీవో కొంకి అప్పారావు, తహసిల్దార్ కే.రమాదేవి, సర్పంచ్ ఎడ్ల కళావతి పాల్గొన్నారు.

చిన్న చూపుతోనే సస్పెండ్ చేశారా

-మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: వైయస్సార్ పార్టీ స్థాపించినప్పటి నుండి మున్సిపాలిటీలో తాను పార్టీకి అనేక సేవలు అందించానని, అలాంటిది ఇప్పుడు ఒక మహిళ అనే చిన్న చూపుతోనే తనను పార్టీ నుండి సస్పెండ్ చేశారా అని మాజీ మున్సిపల్ చైర్పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి శనివారం మీడియా వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. బలిఘట్టం స్థానికులు, అభిమానులతో శనివారం సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆమె మీడియాతో మాట్లాడారు. మహిళ వెనుక ఎవరుంటారనే తక్కువ చేసి తనను సస్పెండ్ చేశారన్నారు. క్రమశిక్షణ చర్యలలో భాగంగా సస్పెండ్ చేసినట్టు పార్టీ నాయకులు, కౌన్సిలర్లు తెలియజేశారని, నోటీసులు ఇవ్వకుండా పార్టీ నుండి ఏవిధంగా సస్పెండ్ చేస్తారని అన్నారు. మునిసిపల్ సమావేశానికి వెళ్ళవద్దని నోటీసులు, సమాచారాన్ని తనకు పార్టీ నుండి ఏమీ ఇవ్వలేదని తెలిపారు. ఈ మున్సిపల్ సమావేశానికి తనతో పాటు వేరొక వైసీపీ కౌన్సిలర్ కూడా రావడం జరిగిందని ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో జి నాగేశ్వరరావు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రీ స్కూల్ డే వేడుకలు

ప్రజాశక్తి- మాడుగుల:అంగన్వాడి సెంటర్లకు వస్తున్న పిల్లలకు ప్రభుత్వం అన్ని విధాలా సౌకర్యాలు కల్పిస్తుందని మహిళా పోలీస్ భాగ్య అన్నారు. శనివారం మాడుగుల అంగన్వాడి 7 సెంటర్లో ఇంచార్జ అంగన్వాడీ ఉపాధ్యాయుని సరోజినీ ఆధ్వర్యంలో ప్రీ స్కూల్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్లకు వస్తున్న పిల్లలు సౌకర్యాలు నిమిత్తమై ఆటలు పరికరాలు, పుస్తకాలు, టేబుల్స్ ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం దేవి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్థల ఆక్రమణ ఫిర్యాదుపై విచారణ

ప్రజాశక్తి - రావికమతం : మండలంలో అప్పలమ్మ పాలెం ఎంపీపీ స్కూల్ స్థలం ఆక్రమణకు గురైనట్లు అందిన ఫిర్యాదు మేరకు శనివారం మండల స్పెషల్ ఆఫీసర్ వసంతరావు, ఎంపీడీవో వెంకన్న బాబు విచారణ చేపట్టారు. అధికారులు ఫిర్యాదుదారులను ఈ విషయమై అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసి ల్దారు కార్యాలయంలో తహశీల్దార్ వెంకటరమణ, ఎండిఓ, మండల స్పెషల్ ఆఫీసర్‌లు ఇరు వర్గాలను విచారించారు. సమస్య పరిష్కారం పూర్తయ్యేంత వరకు ఎవరు ఆ స్థలం వద్దకు వెళ్ళరాదన్నారు.

విచారిస్తున్న అధికారులు

రూ. 25 వేలు విరాళం

ప్రజాశక్తి-మాడుగుల:మాడుగుల బస్టాండ్ ఆవరణంలో ఉన్న దేవి తల్లి ఆలయ గోపురం నిర్మాణానికి స్థానిక న్యాయవాదులు శ్రీనాథ్ ప్రసాదరావు, ప్రమోద్ కుమారులు 25 వేలు రూపాయలు నగదును ఆలయ కమిటీ సభ్యులకు శనివారం అందజేశారు. ఆర్టీసీ సివిల్ అండ్ మోటార్స్ యూనియన్ సభ్యులు స్థానికులు పాల్గొన్నారు.